పరీక్షా సమయం



మడకశిరలోని ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాయడానికి ఏర్పాటు చేసిన బల్లలు

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మడకశిర: నేటి నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మడకశిర నియోజకవర్గంలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మడకశిరలో 3, గుడిబండ, అమరాపురం, అగళిలో ఒక్కొక్కటి చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరపడానికి అధికారులు అన్నింటినీ సిద్ధం చేశారు. ప్రతి గదిలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. అదే విధంగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాగునీరు, వైద్య సౌకర్యం, గదుల్లో పూర్తి స్థాయిలో వెలుతురు, ఫ్యాన్లు ఉండే విధంగా చర్యలు చేపట్టారు.

3,597 మంది ఇంటర్ విద్యార్థులు

మడకశిర నియోజకవర్గంలో ఇంటర్ విద్యార్థులు 3,597 మంది ఉన్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 1,868, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,729 మంది చొప్పున ఉన్నారు. మడకశిరలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల, వేంకటేశ్వర కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే అగళిలో మోడల్, గుడిబండ, అమరాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మడకశిరలోని మూడు కేంద్రాల్లో మొత్తం 2,159 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే అగళిలో 480, గుడిబండలో 442, అమరాపురంలో 516 మంది చొప్పున విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఇదిలా ఉండగా ఇంటర్ పరీక్షల నేపథ్యంలో అన్ని కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక సీఐ సురేష్ బాబు తెలిపారు.

'పురం'లో 12 కేంద్రాలు

హిందూపురం: ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వాహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా 21,904 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నారు. ఇందులో 19,468 మంది జనరల్ పరీక్షలు రాస్తుండగా 2,436 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. హిందూపురం నియోజవర్గంలో ఇంటర్ పరీక్షల నిర్వాహణకు హిందూపురంలో 9 కేంద్రాలు, చిలమత్తూరు 2, లేపాక్షి 1 కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 4026 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడంతో పాటు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు సత్యసాయి జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరంలో 338 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 337 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంట నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ తెలిపారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఒక్క నిమిషం లేటు చేసినా పరీక్షా గదుల్లోకి అనుమతించమన్నారు. పరీక్షలు జరిగే మూడు గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

అమరాపురం: మండలంలో బుధవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మహేష్, డీఓ క్రిష్ణమూర్తి తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో 10 గదులను ఏర్పాటు చేయడంతో పాటు పది మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 276 మంది, అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 248 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ విధించినట్లు ఎస్ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు.

అరగంట ముందే చేరుకోవాలి

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నాం. ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఆలస్యమైతే పరీక్ష కేంద్రాలకు అనుమతించం. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలకు తీసుకురావద్దు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

\- రామకృష్ణప్ప, ప్రిన్సిపాల్, ఒకేషనల్ జూనియర్ కళాశాల, మడకశిర

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

సోమందేపల్లి: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద జరిగే వేలం పాటకు హాజరయ్యే వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సకాలంలో సర్వే పూర్తి చేయాలి



పైడేటిలో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సరస్వతి

పరిగి: ఫీవర్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ సరస్వతి సూచించారు. సోమవారం మండలంలోని పైడేటిలో ఆమె సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. బయోమెట్రిక్ ద్వారానే అటెండెన్స్ నమోదు చేయాలని సూచించారు. అనంతరం స్థానిక అంగనవాడీ కేంద్రాన్ని పరిశీలించి, మధ్యాహ్న భోజనంతో పాటు అక్కడి నిల్వలు, మెయింటెనెన్స్‌పై ఆరా తీశారు. అలాగే గ్రామంలో నిర్మిస్తున్న డ్రైనేజ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



విద్యార్థిని సుస్మితను అభినందిస్తున్న అధ్యాపకులు

పెనుకొండ: 10 రాష్ట్రాల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనే జాతీయ సమైక్యతా శిబిరానికి పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వి. సుస్మిత ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి తెలిపారు. బెంగళూరు యూనివర్సిటీలో ఈనెల 15 నుంచి 21 వరకు కార్యక్రమం జరుగుతుందని అక్కడ జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో మన తెలుగు సాంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థిని ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించడంతో పాటు అధ్యాపకులు ఆర్థిక సాయం చేశారు.

మామిడి చెట్ల దగ్ధం

పెనుకొండ రూరల్: అడవికి నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కోనాపురంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రైతు శ్యామ్ ప్రసాద్ వివరాలు మేరకు... గుర్తు తెలియని వ్యక్తులు అటవీ ప్రాంతానికి నిప్పు పెట్టడంతో మామిడి తోటకి మంటలు వ్యాపించాయి. దీంతో దాదాపుగా 33 చెట్లు కాలిపోయినట్లు బాధిత రైతు శ్యామ్‌ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అసిస్టెంట్ భారతి మంగళవారం రైతుకి చెందిన తోటను పరిశీలించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. వేకువజామున లక్ష్మీదేవి సమేత నరసింహస్వామి మూల విగ్రహానికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పంచలోహ కవచాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. స్వామి వారిని కొలిచే పట్టణ వాసులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా సమీపాన కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణ సమీపంలో వంటకాలు తయారు చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన తర్వాత అన్నదానం చేశారు.

బహిరంగ వేలం ద్వారా పట్టుగూళ్ల విక్రయాలు

- సర్వర్ సమస్యతో నిలిచిపోయిన ఈ మార్కెటింగ్ యాక్షన్



హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో బహిరంగ వేలాలు కొనసాగిస్తున్న మార్కెట్ అధికారులు

హిందూపురం: రాష్ట్రంలోని పట్టుగూళ్ల మార్కెట్లలో ఒక్కటైన హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో మంగళవారం ఈ మార్కెటింగ్ యాక్షన్ నిలిచిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్‌లో సమస్య కారణంగా టెండర్ యాక్షన్ వేయడానికి వీలు పడకపోవడంతో మార్కెటింగ్ అధికారి లక్ష్మిరెడ్డి మధ్యాహ్నం 1 గంట నుంచి బహిరంగ వేలాలు నిర్వహించి రైతుల పట్టుగూళ్ల విక్రయాలు కొనసాగించారు. మార్కెట్‌కు 73 లాట్లుగా 3941.400 కిలోల పట్టుగూళ్లను రైతులు తీసుకువచ్చారు. రెండు దశల్లో జరిగిన బహిరంగ వేలాల్లో గరిష్టంగా కిలో రూ.638 ధర పలుకగా కనిష్టంగా రూ.375 ధర పలికాయి. ఇందులో పెనుకొండ, మడకశిర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పట్టుగూళ్లకు అధిక రేట్లు పలికాయి. రోజువారీగా ఈ టెండర్‌లో దాదాపుగా ప్రస్తుతం ఉన్న ధరలే వచ్చేవని, ఓపెన్ టెండర్‌ను అధికారుల పర్యవేక్షణలో సాగడంతో ధరలు ఆశాజనకంగానే పలికాయని రైతులు తెలిపారు. అయితే ఈ టెండర్‌ను ఓపెన్ వేలాలకు కిలోపై రూ.10 వరకు వ్యాత్యాసం కనిపిస్తోందని పేర్కొన్నారు.బుధవారం నాటికి సర్వర్ సమస్యను పరిష్కరిస్తామని పట్టుగూళ్ల మార్కెట్ అధికారి లక్ష్మిరెడ్డి తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రొళ్ల: మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ రీజినల్ కోఆర్డినేటర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని ఆర్.వడ్రహట్టి గ్రామంలోని ఆర్డీటీ కమ్యూనిటీ భవనం ఆవరణలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లను పంచి పెట్టారు. తొలుత ఆర్డీటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లికార్జున మట్లాడుతూ బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు వారిని ఉన్నత చదువులు చదివించడానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం చుట్టు పక్కల గ్రామాల నుంచి హాజరైన మహిళలకు ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ సుబ్బారావు, సీఓ నాగమణి, సీడీసీ మెంబర్లు, ఆర్డీటీ మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో వైకేపీ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు, చట్టాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ సుజాత , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మడకశిర(అగళి): అగళి మండల కేంద్రంలో త్రివేణి మండల సమైక్య ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మహిళా సంఘాల సభ్యులు మంగళవారం గ్రామ పురవీధుల గుండా బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. తర్వాత బస్టాండ్ ఆవరణంలో మానవహారంగా ఏర్పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ వడ్రహట్టి క్రాస్ కల్వర్టు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులైన గౌడప్ప, సన్నరంగమ్మ తీవ్రంగా గాయ పడ్డారు. స్థానికుల వివరాల మేరకు మండలంలోని చర్లోపల్లికి చెందిన గౌడప్ప అతని భార్య సన్నరంగమ్మ స్వగ్రామం నుంచి బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. ఆర్.వడ్రహట్టి క్రాస్ మలుపు వద్దవున్న కల్వర్టు వద్దకు రాగానే హెచ్‌టీ హళ్లి వైపు నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సన్నరంగమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తుమకూరుకు తరలించారు.

నీటి సమస్య పరిష్కరించండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని టీడీ పల్లి తండాలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని వాటర్ స్కీమ్ మోటారు మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే మోటారుకు మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆర్బీకేల్లో ఈ-పంట జాబితా ప్రదర్శన

లేపాక్షి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రబీ సీజన్‌కు సంబంధించిన ఈ-పంట నమోదు జాబితాను ఈనెల 17 వరకు ప్రదర్శిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి శ్రీలత తెలిపారు. రబీ సీజన్‌లో 12 ఆర్బీకే కేంద్రాల పరిధిలో ఉన్న 1260.05 ఎకరాల్లో నమోదు చేశామన్నారు. అలాగే ఆయా ఆర్బీకే కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించి, రైతుల వివరాలను చదివి వినిపించడం జరుగుతుందన్నారు. ముసాయిదా జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే ఆర్బీకే సిబ్బందికి రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా పది ఆర్బీకే పరిధిలో ఈ-క్రాప్ బుకింగ్ నమోదు జాబితాను ప్రదర్శిస్తున్నట్లు వీఏఏ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు.


స్థల వితరణ

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లిలో నడిబోడ్డున తనకున్న స్థలాన్ని చిన్నరాయన్న అలియస్ సన్నప్ప మారెమ్మ ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం వితరణ చేశారు. 33 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పుతో ఉన్న స్థలాన్ని లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. గ్రామ దేవత మారెమ్మ ఆలయ ఆవరణం ఇరుకుగా ఉండటంతో పూజా కార్యక్రమాలు చేసేటప్పుడు ఇబ్బందిగా ఉంది. దీంతో చిన్నరాయన్న అలియాస్ సన్నప్ప ఇంటి స్థలాన్ని విరాళంగా మారెమ్మ దేవాలయానికి అందించడంతో ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని మానవ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథకం ఎలా కొనసాగుతోంది? భోజనం నాణ్యతగా చేస్తున్నారా? లేదా, మెను ప్రకారం భోజనం పెడుతున్నారా అనే వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి వర్కింగ్ డివిజన్ చైర్మన్ శంకరప్ప, డివిజన్ చైర్మన్ నందకుమార్, లేపాక్షి చైర్మన్ నాగరాజు తదిరులు పాల్గొన్నారు.

'జాబిలి'కి ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు



పెనుకొండ: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత జాబిలి చాంద్‌బాషాకు ఇంటర్నేషనల్ గ్లోరీ పురస్కారం లభించింది. ఈ మేరకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన కే. చక్రవర్తి పురస్కారాన్ని ప్రకటిస్తూ వెబ్ వేదిక ద్వారా సత్కరించారు. రచయితగా, కవిగా చేసిన సేవలకు గుర్తుగా తనకు ఈ పురస్కారాన్ని అందించినట్లు జాబిలి చాంద్‌బాషా తెలిపారు.

చట్టాలపై అవగాహన



నారనాగేపల్లి చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామంలో టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పడిన అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ చట్టం, గృహహింస, వేధింపులు, బాల్య వివాహాలు తదితర వివిధ చట్టాలపై వివరించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ఎక్కడైనా మహిళలపై వేధింపులు, గృహహింసలను ఎదుర్కొంటుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ న్యాయ సలహాల కేంద్రం కమిటీ సభ్యులు, మహాశక్తి ఉపాధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, అనంతశక్తి సొసైటీ సిబ్బంది గంగరత్న తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం ఏర్పాటుకు విరాళం



చెక్కు అందచేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న వైకుంఠ రథం కోసం మంగళవారం గోరంట్ల మండల ఆర్య వైశ్య సంఘం 1,00,116 విరాళం ప్రకటించింది. ఆ మొత్తానికి సంబంధించి చెక్కును గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాగేనాయక్, ఆర్యవైశ్య సంఘం నాయకులు బాలరాంగుప్తా, సుర్యప్రకాష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'ఆల్బెండజోల్'తో సంపూర్ణ ఆరోగ్యం



పరిగి: మాట్లాడుతున్న డాక్టర్ నవీన



గుడిబండ: ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తున్న మంజువాణి



హిందూపురం: విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న దృశ్యం

పరిగి: పిల్లలు, విద్యార్థుల అనారోగ్యానికి కారణమైన నులిపురుగులను నలిమేద్దామని అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పరిగి మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతో పాటూ అంగనవాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సత్యకృపారాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఆల్‌బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయన్నారు.

మడకశిర(అగళి): అగళి పట్టణంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తప్పని సరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఆశ వర్కర్లు మహాలక్ష్మీ, సరసమ్మ, లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీ, మోడల్ స్కూల్, గుప్తా కళాశాలలో జాతీయ నూలిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు మంగళవారం నూలిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రధారి, కేజీబీఓ ఎస్ఓ నాగరత్న, పాల్గొన్నారు.

గుడిబండ: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటి డీఎంహెచ్ఓ మంజువాణి తెలిపారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మండలంలోని మోపురుగుండు, గుడిబండ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మంజువాణి మాట్లాడుతూ హెచ్3-ఎన్2 వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు కచ్చితంగా మాస్కులు ధరించాలని సూచించారు.

రొద్దం: ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే అనేక రోగాలకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ జగదీశ్‌బాబు అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా మండల పరిధిలోని పెద్దమంతూరు గ్రామంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ మహాలక్ష్మి, సూపర్ వైజర్ గిరినాథ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: 1 నుంచి 19 ఏళ్ల వయస్సున్న వారిలో నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఇఓ అంజనేయులునాయక్ తెలిపారు. మంగళవారం సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో ఈఓ ఆర్‌డీ నాగరాజు, వైద్యులు నరేష్, హరీష్, హెచ్ ఎం ఖాదర్‌లి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: నులిపురుగుల నివారణతోనే రక్తహీనతను అరికట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, వైద్యాధికారి జగదీష్‌బాబు పేర్కొన్నారు. పట్టణంతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.

రొళ్ల: బాల,బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి, మండల ప్రజా పరిషత్ ఏఓ ఆరాధ్య, ఈఓఆర్డీ క్రిష్ణప్ప, సీహెచ్ఓ ఈశ్వరమ్మ తదితరులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని విద్యాసంస్థల్లోని 6107 మంది విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతను పాటించడం వల్ల ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మున్వార్ జాన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, ఎంపీహెచ్ఈఓ షమివుల్లా, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, ఏఎన్ఎం జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగుల నివారణకు మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అమరాపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌ఓలు, ఆరోగ్య, ఆశా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు అందించారు. నులి పురుగుల నివారణ మందులు తీసుకుంటే ఆరోగ్యంతో ఉంటారని డాక్టర్లు భార్గవ్, అంబరీష్ , రాష్ట్ర కుంచిటి వక్కలిగ సంఘం డైరెక్టర్ రాజేశ్వరి తెలిపారు 10,620 మందికి మందులు వేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తెలిపారు.

లేపాక్షి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా లేపాక్షిలోని ఏపీ గురుకుల విద్యాలయం, మెయిన్ పాఠశాల, ఉర్దు పాఠశాల, ఉర్దు బాలికలు, ఉర్దు ఉన్నత పాఠశాల, ఓరియంటల్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం ఉదయం ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశార. ఎంఈఓ నాగరాజు, సీడీపీఓ రెడ్డిరమణమ్మ, ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



అల్ట్రా సైక్లిస్ట్‌ను అభినందిస్తున్న అఖిల భారత చిన్నపిల్లల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కేశవులు

హిందూపురం: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని, డబ్బాపాలు వద్దు...తల్లిపాలు ముద్దు అంటూ తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ అహ్మదాబాద్‌కు చెందిన అల్ట్రా సైక్లిస్ట్ గీతారావు శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకూ సైకిల్ యాత్ర చేపట్టారు. మంగళవారం ఆమె సైకిల్ యాత్ర కొడికొండ చెక్‌పోస్టు వద్దకు చేరుకుంది. అఖిల భారత చిన్నపిల్లల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేశవులు ఆమెకు స్వాగతించి ఘనంగా సన్మానించారు. సైకిల్ యాత్ర ఈ నెల 1వ తేదీ ప్రారంభించానని, మరో రెండురోజుల్లో కన్యాకుమారికి చేరుకుంటుందని గీతారావు తెలిపారు. నేటి తరం వారు తల్లిపాల అవశ్యకత గుర్తించలేకపోతున్నారని, మరికొందరు అవగాహన లోపంతో బిడ్డలకు పాలు పట్టడం లేదన్నారు. అందువల్లే తాను దాదాపు 3,700 కి.మీ మేర సైకిల్‌పై ప్రయాణిస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నానని తెలిపారు.

ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్

గుడిబండ: ఉన్నత చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. మంగళవారం స్థానిక బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ చదువున్న విద్యార్థినులకు ఎస్ఐ తన సొంత డబ్బుతో రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, ఏఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ రావడం హర్షణీయం



ఆర్ఆర్ఆర్ చిత్రానికి ఆస్కార్ రావడంపై సంబరాల్లో అభిమానులు

హిందూపురం టౌన్: జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ నటించిన ఆర్ఆర్ఆర్ చిత్రం నుంచి నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంపై ఎన్టీఆర్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం పట్టణంలో ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఆర్ఆర్ఆర్ చిత్రానికి ఆస్కార్ రావడం తెలుగు వారిగా ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ సుమో శీన, ఉపాధ్యక్షుడు వెంకటేష్, లింగప్ప, బాబా, జాహీద్, షౌకత్ ఖాన్, దాదు ఖాన్, రామకృష్ణ, అఖిబ్, లోకేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.